

# సినిమా న్యూస్



## బన్నీతో సినిమా బాసిల్ క్లారిటీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పుష్ప సినిమాతో పాన్ ఇండియా రేంజ్ కు వెళ్లిన అల్లు అర్జున్... వర్ష సినిమాలతో దూసుకు వెళ్తున్నారు. ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్... మరో సినిమాకు కూడా శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతున్నట్లు ఇప్పటికే ఫోన్ న్యూస్ బయటకు వచ్చింది. అయితే దీనిపై స్వయంగా బాసిల్ జోసెఫ్ క్లారిటీ ఇచ్చారు. ఐకాన్ స్టార్ అని క్యాప్ ఫోటో షేర్ చేసి బన్నీ ఫ్యాన్స్ కు బిగ్ ట్రీట్ ఇచ్చారు. దానికి ఆర్య సినిమాలోని రింగ రింగ పాటను కూడా యాడ్ చేశారు. దీంతో బాసిల్ జోసెఫ్, బన్నీ కాంబినేషన్ లో సినిమా దాదాపు కన్ఫామ్ అయినట్లేనని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కాగా అల్లు అర్జున్, అట్లీ దర్శకత్వంలో వస్తున్న రాకా సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

## అఫీషియల్‌గా 'జననాయగన్' రాకకు రంగం సిద్ధం

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటిస్తున్న ఆఖరి చిత్రం విడుదల తేదీ ఎట్టకేలకు అధికారికంగా ఖరారైంది. ఎన్నో వాయిదాలు, సెన్సార్ వివాదాల తర్వాత ఈ చిత్రానికి 'జననాయగన్' (తెలుగులో 'జననాయకుడు', హిందీలో 'జన్ నేత') అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ KVN ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ ఇప్పటికే 'A' సర్టిఫికేట్ జారీ చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో జులై 23న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.




## 'మండాడి' రిలీజ్ వాయిదా

కోలీవుడ్ నటుడు సూరి, టాలీవుడ్ హీరో సుహాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'మండాడి'. ఈ సినిమాతో సుహాస్ తమిళ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తుండటం విశేషం. మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా, తీర ప్రాంతం, మత్స్యకారుల జీవన విధానం బ్యాక్‌డ్రాప్‌లో ఒక ఇంట్రెస్టింగ్ స్పోర్ట్స్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్చుత్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ కంపోజర్ జీవీ ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని మొదట సెప్టెంబర్ 4న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో ఇరు పరిశ్రమలకు చెందిన సినీ ప్రియులు ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


ఈనేపథ్యంలో.. తాజాగా మూవీ మేకర్స్ ప్రేక్షకులకు ఒక సడెన్ ట్విస్ట్ ఇస్తూ, సోషల్ మీడియా వేదికగా డబుల్ అప్‌డేట్స్‌ను పంచుకున్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల 'మండాడి' సినిమా విడుదల వాయిదా పడినట్లు తెలుపుతూ.. కొత్త రిలీజ్ డేట్‌ను కన్ఫర్మ్ చేశారు. ఈ చిత్రం ఇప్పుడు సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా విడుదల కాబోతున్నట్లు వెల్లడించారు. రిలీజ్ డేట్ మార్పుతో పాటు ఫ్యాన్స్‌ను ఖుషీ చేయడానికి మేకర్స్ మరో క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ సాంగ్ ప్రోమోను జూలై 18న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే, ప్రోమో డేట్ చెప్పినప్పటికీ.. పూర్తి పాటను ఎప్పుడు విడుదల చేస్తారనే విషయాన్ని మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌లో ఉంచారు. ఈ అప్‌డేట్‌తో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అందులో హీరోలు సుహాస్, సూరి ఇద్దరూ మాస్ స్టెప్ వేస్తూ.. తమ ముఖాలను కోట్‌తో కవర్ చేసుకుని కనిపించడం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది.




## దసరాకి భారీ కాంబో సందడి

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా మిక్స్ టాక్ తో కూడా సుమారు 400 కోట్ల కలెక్షన్లు రాబట్టి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. కొన్నిచోట్ల కలెక్షన్ల విషయంలో కొంత చర్చోపచర్చలు జరుగుతున్నా, రామ్ చరణ్ తర్వాతి సినిమా మీద ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. ఇక సుకుమార్ దర్శకత్వంలో రామ్ చరణ్ తర్వాతి సినిమా ఉండబోతోంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లోనే రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో, అలాగే సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ సహ నిర్మాణంలో ఈ సినిమా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన స్టోరీ లాక్ అయినట్లుగా చెబుతున్నారు.

ఇక ఈ సినిమా షూటింగ్ కూడా దసరాకి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. దసరాకి ఒక పూజా కార్యక్రమం ఏర్పాటు చేసి, ఆ తర్వాత త్వరలోనే షూట్ కి కూడా వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా చెబుతున్నారు. నిజానికి 'RRR' తర్వాత రామ్ చరణ్ క్రేజ్ గ్లోబల్ స్థాయికి చేరింది. ఆ తర్వాత 'గేమ్ ఛేంజర్' సినిమా నిరాశపరిచినా కూడా, తర్వాతి సినిమా మిక్స్ టాక్ తో కూడా దూసుకుపోయింది. ఈ క్రమంలో రామ్ చరణ్, సుకుమార్ తో చేయబోతున్న సినిమాని కూడా దసరాకి ప్రారంభించి, వీలైనంత త్వరగానే ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



## శరవేగంగా 'మహాకాళి'



టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సృష్టించిన 'హనుమాన్ సినిమాటిక్ యూనివర్స్' (పీవీసీయూ) నుంచి రాబోతున్న తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' కీలక మైలురాయిని చేరుకుంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం 125 రోజుల పాటు సాగిన సుదీర్ఘ, భారీ షూటింగ్ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించుకుని, ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌లోకి అడుగుపెట్టింది. ఈ సుదీర్ఘ షెడ్యూల్‌లో చిత్రంలోని అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు మేకర్స్ ప్రకటించారు.

ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్న బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా, యువ హీరో రోహిత్ సరాఫ్ తమకు సంబంధించిన షూటింగ్ భాగాలను పూర్తి చేసుకున్నారు. ఆర్.కె. దుగ్గల్ సమర్పణలో, ఆర్.కె.డి స్టూడియోస్ బ్యానర్‌పై పూజా కొల్లూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ డివైన్ యాక్షన్ డ్రామాలో భూమి శెట్టి కూడా నటిస్తున్నారు. ప్రేక్షకులకు సరికొత్త దృశ్యానుభూతిని పంచేందుకు ఈ సినిమాను ప్రత్యేకంగా ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తుండటం విశేషం. అతి త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక విడుదల తేదీతో పాటు మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను ఇస్తామని చిత్ర యూనిట్ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది.

## ప్రభాస్ మూవీకి భారీ డీల్

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' అనే పవర్‌ఫుల్ స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ మూవీపై భారీ స్థాయిలో అంచనాలు ఉండటంతో ఇప్పటికే కర్ణాటక థియేట్రికల్ హక్కులను మేకర్స్ సెల్ చేసినట్లు తెలుస్తోంది.



ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ మూవీ కర్ణాటక థియేట్రికల్ హక్కులను ఏసియన్ సినిమాస్ సంస్థ భారీ ధరకు దక్కించుకున్నట్లు సమాచారం. అలాగే ఈ సంస్థ కర్ణాటకలో సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇక తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్, హర్షవర్ధన్ రాణే కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని టి-సిరీస్ ఫిలిమ్స్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు.